ప్రజాశక్తి
మంగళవారం 2 జనవరి 2024
5
విజయనగరం



నేటి నుంచి రెండో విడత ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష 2 వ విడత కార్యక్రమం ఈ నెల 2 నుంచి 6 నెలల పాటు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఒక ప్రకటన లో తెలిపారు. ప్రతి మండలంలో వారానికో క్యాంపు జరుగుతుందని, గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, శుక్రవారాల్లోను, పట్టణ ప్రాంతాల్లో బుధ , గురువారాల్లో జరుగుతుందని తెలిపారు. ఈ క్యాంపుల్లో నలుగురు వైద్యుల బృందం ఉంటుందని, అందులో ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు కూడా ఉంటారని తెలిపారు. వెల్నెస్ కేంద్రాల్లో జరుగు ఈ క్యాంపు ల కోసం రిజిస్ట్రేషన్ కౌంటర్, హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 92 రకాల మందులను, పట్టణ ప్రాంతాల్లో 187 రకాల మందులను పంపిణీ చేయడం జరుగుతుందని, ఈ క్యాంపుల్లో 14 రకాల పరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు. ఆశ, ఎఎన్ఎంలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించి ఎక్కువ మంది నమోదు అయ్యేలా చూడాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.



పరిహారం ఇవ్వకుండా సరిహద్దు రాళ్లు వేయడంతో కంచె వేసిన మహిళా రైతు

- విమానాశ్రయ అప్రోచ్ రోడ్డు భూసేకరణలో పరిహారం చెల్లించకుండానే భూమి లాక్కొనే యత్నం
- భూమి విలువ రూ.కోటి పైనే
- అవసరమైన చోట వదిలేసి, అనవసరమైన చోట భూసేకరణ
- స్పందనలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

అధికారుల తప్పిదం
రైతు పాలిట శాపం

విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన భూసేకరణలో అధికారుల తప్పిదం వలన ఓ రైతు తన జిరాయితీ భూమిని కోల్పోవలసిన పరిస్థితి ఏర్పడింది. రోడ్డుకు సేకరించిన భూమికి పరిహారం సబంధిత రైతులకు వేశారు. కాని జిఎంఆర్ సంస్థకు ఈ రోడ్డుకు సంబంధించిన భూమిని రెవెన్యూ అధికారులు అప్పగించే సమయంలో గతంలో సేకరించకుండా పరిహారం వేయని రైతు భూమిని రహదారి కోసం అప్పజెప్పేసి పరిహారం చెల్లించిన రైతు భూమిని వృథాగా వదిలేశారు. దీంతో భూమిని కోల్పోతున్న సంబంధిత మహిళా రైతు.. అధికారులతోపాటు జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో నేరుగా కలెక్టరుకు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారని ఈ రైతు ఆరోపిస్తున్నారు. చేసిన తప్పిదం బయటపడితే తమకు ముప్పు వాటిల్లుతుందనే భయంతో అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-భోగాపురం

భోగాపురం గ్రామానికి చెందిన మాతా శిరోమణి అనే మహిళా రైతుకు గూడెపువలస రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 42-1లో 1.50 ఎకరాల భూమి ఉంది. ఇందులో విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 27 సెంట్లు ప్రభుత్వం తీసుకుంది. ఇందుకు సుమారు 9 లక్షలు నష్ట పరిహారం 2017లో అందజేసి సరిహద్దు రాళ్లు కూడా రెవెన్యూ అధికారులు వేశారు. ఈ ఏడాది మే నెలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి విమానాశ్రయానికి శంకుస్థాపన చేసిన తరువాత జిఎంఆర్ సంస్థకు ఈ రోడ్డుకు సంబంధించిన భూమిని రెవెన్యూ అధికారులు అప్పజెప్పారు. ఆ సమయంలో గతంలో సంబంధిత మహిళా రైతు నుంచి సేకరించిన 27 సెంట్లు భూమితో పాటు పరిహారం చెల్లించకుండా మరో 40సెంట్లు జిరాయితీ భూములో నుంచి సరిహద్దురాళ్లు కొత్తగా వేశారు. ఇక్కడ రహదారి ఏవిధంగా వెళ్తుందో తెలిసి కూడా వేరే రైతుకు సంబంధించిన భూమిని సేకరించారు. తొలుత పరిహారం ఇచ్చిన రైతు భూమిని వృథాగా వదిలేశారు. దీంతో ప్రస్తుత మహిళా రైతు సుమారు కోటి రూపాయలు విలువైన భూమిని కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తే భూసేకరణలో జరిగిన ఈ తప్పిదం బయటపడితే తమకే ప్రమాదమనే ఉద్దేశంతో పట్టించుకోవడం లేదని అంటున్నారు.

స్పందనలో ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

మహిళా రైతు శిరోమణి తన కుమారుడు మాతా శేషుబాబుతో కలిసి మేలోనే ముందుగా ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. కనీసం పట్టించుకోకపోవడంతో చివరికి స్పందనలో ఈ ఏడాది జులైలో ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు ఒక్కరూ పట్టించుకోలేదని రైతులు అంటున్నారు. స్థానిక అధికారులు వచ్చి చూసి వెళ్లిపోయారే తప్ప దీనిపై రైతుకు ఎటువంటి న్యాయమూ చేయలేదు.



అధికారుల తప్పిదంతోనే విలువైన భూమి కోల్పోవలసి వస్తుంది

గతంలో రహదారి కోసం భూసేకరణ చేసేటప్పుడు 2007లో కేవలం 27 సెంట్లు మాత్రమే తీసుకొని పరిహారం వేశారు. ఆ తరువాత జిఎంఆర్ సంస్థకు భూమిని అప్పజెప్పేటప్పుడు అక్కడ సేకరించిన మరో రైతు భూమిని వృథాగా వదిలేసి నా 40సెంట్లు జిరాయితీ భూమికి పరిహారం ఇవ్వకుండా సరిహద్దు రాళ్ళు వేసి వెళ్లిపోయారు. అధికారులు చుట్టూ తిరిగిన స్పందించడంలేదు. చివరకు స్పందనలో కూడా ఫిర్యాదు చేశాను. అయినప్పటికి మాకు న్యాయం జరగలేదు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నాను.

- మాతా శిరోమణి, మహిళా రైతు, భోగాపురం

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

మంత్రి బొత్సను కలిసిన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు



మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తన నివాసంలో జరిగిన కొత్త సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికా పాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ ఎంవి.సూర్యకళ , వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో మంత్రి బొత్సతో పాటు ఆయన సతీమణి, మాజీ ఎంపీ బొత్స బొత్స ఝాన్సీలక్ష్మి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. చైర్ పర్సన్ మజ్జి శ్రీనివాసరావు కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఆయనకు పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిడిఒలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జెడ్‌పి సిఇఒ కె.రాజ్ కుమార్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్లో నూతన సంవత్సర వేడుకలు


కలెక్టరేట్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టర్ నాగలక్ష్మికి జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల, అసోసియేషన్ల ప్రతినిధులు పెద్ద ఎత్తున కలెక్టర్ ఛాంబర్ లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అభివృద్ధికి ప్రతి అధికారి శాఖా పరంగా తమ వంతు కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తన చాంబర్లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆయనకు జిల్లా అధికారులు, సిబ్బంది, అసోసియేషన్ ప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

కలెక్టరేట్లో జరిగిన ఈ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి అనిత, ఆర్‌డిఒలు, ప్రత్యేక ఉప కలెక్టర్లు, ఇతర అధికారులు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్సను కలిసిన రాజీవ్ గాంధీ యూనివర్సిటీ డైరెక్టర్

నూతన సంవత్సరం సందర్భంగా విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఆయన నివాసంలో డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ ఇతర ఐఐఐటి ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది అందరికీ శుభాలు కలగాలని మంత్రి బొత్స ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్ బాబు, పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆసిరి నాయుడు,డీన్ వెల్ఫేర్ రవి, పిఆర్‌ఒ మామిడి షణ్ముఖ ఉన్నారు.



అశోక్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్న టిడిపి నాయకులు

కోలగట్ల నివాసంలో..

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ భారీ కేకును కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఘోషాసుపత్రిలో బాలింతలకు, గర్భిణీలకు రొట్టెలు పళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్,వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, ఎఎంసి చైర్మన్ శశి భార్గవి,మండల పార్టీ అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో..

టిడిపి కార్యాలయం అశోక్ బంగ్లాలో టిడిపి పొలెట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు, నియోజక ఇన్‌ఛార్జి అతిధి గజపతిరాజు కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామినాయుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, నియోజకవర్గాల ఇన్చార్జులు, పట్టణ అధ్యక్షులు, కార్యదర్శి, జనసేన నాయకులు గురాన అయ్యలు అశోక్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



పోస్టుకార్డులతో సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల
పోస్టుకార్డు ఉద్యమం

- 12వ రోజుకు చేరిన సమ్మె
- ప్రభుత్వం స్పందించకుంటే మరింత ఉధృతం
- జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కాంతారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె సోమవారానికి 12వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా పోస్ట్ కార్డు లు ముఖ్యమంత్రికి రాసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు మాట్లాడుతూ తమతో మంత్రి బొత్స చర్చలు జరిపి ఎటువంటి పరిష్కారం చూపకుండా సమ్మెను విరమించాలని కోరడం సరికాదని అన్నారు. తాము ప్రభుత్వాన్ని కొత్తగా ఏమీ అడగలేదని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ప్రభుత్వం తమ వేతనాలు, రెగ్యులరైజేషన్ గురించి స్పష్టమైన హామీ ఇస్తే తప్ప సమ్మె విరమించేది లేదన్నారు. అనంతరం పోస్టు కార్డులను తపాలా బాక్స్‌లో వేసి సిఎంకి పంపించారు. కార్యక్రమంలో జెఎసి జిల్లా అధ్యక్షుడు గురువులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



పోస్టుబాక్సులో కార్డులు వేస్తున్న ఉద్యోగులు

సిఎం మనసు మారాలని..

వినూత్న రీతిలో అంగన్వాడీల నిరసన • 21వ రోజుకు నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కొత్త సంవత్సరంలోనైనా ముఖ్యమంత్రి మనసు మారి అంగన్వాడీ కార్యకర్తల, ఆయాల వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్‌వాడీలు సోమవారం కేక్ కట్ చేసి, అనంతరం సోది చెప్పి నిరసన వ్యక్తం చేశారు. రాధా అనే అంగన్వాడీ వర్కర్ సోది చెబుతూ అందరినీ అలరించింది. అనంతరం యూనియన్ జిల్లా అధ్యక్షులు బి పైడిరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలు సమ్మె చేపట్టి 21 రోజులు అవుతున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. వేతనాలు పెంచి, గ్రాట్యుటీ చెల్లించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహన్, సుశీల, ఉష పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలో అంగన్వాడీల నిరవధిక సమ్మె 21వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా శిబిరంలో అంగన్వాడీల సమస్యలను పాటగా పెట్టి కోలాటం ఆడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుభాషిని, పి.జ్యోతి, డి.నాగమణి, సన్యాసమ్మ, రాములమ్మ, సుజాత పాల్గొన్నారు.



జామిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

శంగవరపుకోట : అంగన్వాడీల సమ్మె సోమవారం కొనసాగింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, జిల్లా కమిటీ మెంబర్ చెలికాని ముత్యాలు, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.శ్యామల, డి.జయలక్ష్మి, వి.మాణిక్యం, కె.సుశీల పాల్గొన్నారు.

జామి : జామిలో రహదారిపై వినూత్నరీతిలో మోకాళ్లపై కూర్చొని అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కనకమహాలక్ష్మి, వెంకటలక్ష్మి, శ్రీదేవి, విష్ణుమ్మ, ఆదిలక్ష్మి, రామలక్ష్మి, వరలక్ష్మి, దేవుడమ్మ పాల్గొన్నారు.

చీపురుపల్లి : నూతన సంవత్సర వేడుకలను సైతం పక్కన పెట్టి అంగన్‌వాడీలు సోమవారం తమ సమ్మెను చీపురుపల్లిలో కొనసాగించారు. ఈ సమ్మెకు సిఐటియు నాయకులు అంబళ్ల గౌరినాయుడు సంఘీభావం తెలపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ చీపురుపల్లి ప్రాజెక్టు అధ్యక్షులు బలగ నాగమణి,పాల్గొన్నారు.

బొబ్బిలి : అంగన్వాడీల సమ్మె శిబిరంలో ఆట, పాటలతో నిరసన చేపట్టారు. మాట తప్పను, మడమ తిప్పను.. అంటూ సిఎం జగన్ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి, మడమ తిప్పడం న్యాయమా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, నిర్మల, ప్రసన్నలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.





బొబ్బిలిలో కోలాటం ఆడుతూ, విజయనగరంలో సోది చెబుతూ నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

నా భర్త మృతదేహాన్ని తీసుకురండి

ఎమ్‌పి రామ్మోహన్ నాయుడును కోరిన బాధితురాలు



ఎమ్‌పి రామ్మోహన్‌నాయుడుకు వినతి అందిస్తున్న బాధితురాలు

ప్రజాశక్తి - జామి

ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి, నెల రోజులు ముగియకుందానే మృతి చెందిన తన భర్త కొత్తలి బంగారునాయుడు మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావాలని ఎమ్‌పి రామ్మోహన్‌నాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయి డును మృతుడి భార్య కొత్తలి ఎర్నమ్మ కోరింది. మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు సాయంతో ఎర్నమ్మ ఎమ్‌పిని కలిసింది. దీనిపై స్పందించిన రామ్మోహన్ నాయుడు ఇమిగ్రేషన్ వారితో మాట్లాడి, మృతదేహాన్ని రప్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఇప్పటికే ఎర్నమ్మ జిల్లా కలెక్టర్‌ని ఆశ్రయించి, తన భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావాలని కోరింది. గతేడాది నవంబర్ 29న జామి మేజరు పంచాయతీకి చెందిన కొత్తలి బంగారునాయుడు కొంతమందితో కలిసి ఉద్యోగం నిమిత్తం దుబాయ్ వెళ్లాడు. నెల రోజులు గడవక ముందే బంగారునాయుడు మరణించడంతో ఆ నిరుపేద కుటుంబం రోడ్డున పడింది. కనీసం భర్తను చివరిచూపు చూసుకోవడానికి అవకాశం లేకపోవడంతో ఎర్నమ్మ తల్లడిల్లిపోతోంది. ఈ నేపథ్యంలోనే ఎమ్‌పి రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడును తన పిల్లలతో సహా వెళ్లి కలిసి, భర్త మృతదేహాన్ని రప్పించాలని వేడుకొంది.

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో సుస్మిత ప్రతిభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయి పురుష మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో యువజన విభాగంలో కొండవెలగాడకు చెందిన వల్లూరు సుస్మిత రజిత పతకం సాధించింది. అరుణాచల్ ప్రదేశ్ ఇటానగర్ రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో గత నెల 28 నుంచి జరుగుతున్న జాతీయ స్థాయి మెన్, ఉమెన్, యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న సుస్మిత 55 కిలోల విభాగంలో స్నాచ్ 77 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 96 కిలోలు మొత్తం 173 కిలోలు బరువెత్తి రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా సుస్మితను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.లక్ష్మీనారాయణ, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బి. వెంకట రామయ్య, బి.లక్ష్మీ, కోచ్ చల్లా రాము అభినందించారు.



రజత పతకంతో సుస్మిత

నేడు గ్రూపు-2 స్టడీ మెటీరియల్ పంపిణీ

బొబ్బిలి : గ్రూపు-2 పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మంగళవారం ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.విజయగౌరి చెప్పారు. గ్రూపు-2 పరీక్షల కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు 100 పేజీల పుస్తకాన్ని రాసి ముద్రించి విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు అండర్ 17,19 జట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 17,19 బాక్సింగ్ రాష్ట్రస్థాయి టీములు జాతీయస్థాయి పోటీలలో పాల్గొనేందుకు సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లాయి. ఈ పోటీలు జనవరి 3 నుంచి 8 తేదీ వరకు ఢిల్లీ లోని త్యాగరాజ స్టేడియంలో జరుగనున్నాయి. మొత్తం రెండు విభాగాలలో కలిపి 27 మంది క్రీడాకారులు, కోచ్, మెనేజర్లుగా నలుగురు వ్యాయామ ఉపాధ్యాయులు వెళుతున్నారు. ఈ క్రీడాకారులను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కన్వీనర్, డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి ,ఉప విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్‌వి రమణ, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డోల మన్మధ కుమార్ అభినందనలు తెలిపారు.

ఉత్తమ కార్టూనిస్టుగా భాస్కరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉత్తమ కార్టూనిస్టుగా గుంట్రెడ్డి భాస్కరరావు ఎంపికయ్యారు. విజయవాడకు చెందిన గుల్లపల్లి అరుణకుమారి స్మారక సాహిత్య సంస్థ హాస్యానంద సహకారంతో ఆన్‌లైన్‌లో కార్టూన్ల పోటీలు నిర్వహించారు. కార్టూన్ల పోటీల్లో బొబ్బిలి పట్టణానికి చెందిన భాస్కరరావుకు ఉత్తమ కార్టూనిస్ట్ అవార్డు లభించింది. ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా భాస్కరరావుకు పురస్కారం అందించనున్నారు. భాస్కరరావును సాహితీవేత్తలు అభినందించారు.



గుంట్రెడ్డి భాస్కరరావు



సోంపురం కూడలిలో దట్టంగా మంచు కురుస్తుండటంతో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనాలు

పొగమంచుతో ఇబ్బందులు

ప్రజాశక్తి-వేపాడ

వారం రోజులుగా వేపాడ మండలంలో దట్టంగా పొగమంచు కురుస్తోంది. ఉదయం 9 గంటల వరకూ మంచుదుప్పటి కప్పేస్తోంది. సోంపురం జంక్షన్ నుంచి ఆనందపురం కూడలికి వెళ్లే ప్రధాన రహదారిపై వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. విపరీతంగా మంచు కురవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- బలిజిపేట

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం రాస్తారోకో నిర్వహించింది. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చెప్పాడ సుబ్బయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు సమస్యలు పరిష్కారం చేస్తానని ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చి ఇప్పుడు మోసం చేశారన్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత మొట్టమొదట భవన నిర్మాణ కార్మికుల బ్రతుకులు నాశనం చేసేలా ఇసుక విధానం తీసుకు వచ్చారని చెప్పారు. కరోనా సమయంలో భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులు పడినా కనీసం జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కనికరించలేదన్నారు. పైగా రాజశేఖర్ రెడ్డి భవ నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం వాళ్ళ కుటుంబాలు ఆనందం కోసం సంక్షేమ బోర్డును ప్రవేశపెడితే మడమ తిప్పను మాట తప్పను అని నమ్మించి తండ్రి తెచ్చిన సంక్షేమ బోర్డును కొడుకు జగన్మోహన్ రెడ్డి రద్దు చేయడం అత్యంత దారుణమన్నారు. రాస్తారోకో అనంతరం అంగన్వాడీలు చేస్తున్న పోరాటానికి ర్యాలీగా వెళ్లి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు నూలకమజ్జి గౌరీ, చింతాడు కైలాసం, శ్రీను, మురళి, చక్రధర్, గణపతి, వెంకన్న, తిరపతి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో మెరిసిన గిరిజన బాలురు

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో రాష్ట్ర స్థాయి గేమ్స్, స్పోర్ట్స్ పోటీల్లో స్థానిక గురుకుల విద్యార్థులు మరోసారి సత్తాచాటారు. ఇటీవల సాలూరు మండలం పి.కోనవలస గురుకుల కళాశాల మైదానంలో జరిగిన ఈ పోటీల్లో స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థి పి.ప్రభునందు వంద మీటర్ల పరుగు పందెంలో బంగారం, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించాడు. అలాగే ఎ.రాహుల్ జావెలిన్‌త్రో విభాగంలో బంగారు పతకం సాధించగా, సిహెచ్ రోహిత్ 1500 మీటర్ల పరుగు పందెం, కె.అశోక్ హైజంప్‌లో రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, కాబట్టి చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులకు మంచి ప్రతిభ కనబరిచేలా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని బొడ్లపాడు జంక్షన్ సమీపంలో సోమవారం పాసిన బిల్లి అరవింద్(24) అనే వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందాడు. పోలీసులు గ్రామస్తులు చెప్పిన వివరాలు ప్రకారం.. పాలకొండ మండలం గోపాలపురం గ్రామానికి చెందిన పాసినబిల్లి అరవింద్ తెలంగాణ రాష్ట్రంలోనే హైదరాబాదులో ఓ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నారు. తోటి స్నేహితుల వద్ద అధికంగా నగదు తీసుకొని అప్పులు తీర్చలేక తల్లిదండ్రులకు చెప్పడానికి భయపడి మనస్థాపంతో ఉండేవాడు. ఈ నేపథ్యంలో బొడ్లపాడు జంక్షన్ సమీపంలో అరవింద్ కాలిపోయి మృతి చెందిన విషయాన్ని గ్రామస్తులు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ఎం గోవిందరావు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శవ పంచనామ చేసి పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. తండ్రి ఎర్రమనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.గోవిందరావు తెలిపారు.


ఘనంగా న్యూఇయర్ వేడుకలు



బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



న్యూఇయర్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎస్పి దీపిక



నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండకు గ్రీటింగ్ అందజేస్తున్న ఎ.రావివలస సర్పంచ్ శివారెడ్డి



మంత్రి బొత్సకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న జిసిసి చైర్‌పర్సన్ స్వాతీరాణి



టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బంగార్రాజుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు




టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



బొబ్బిలిలో సుజయకృష్ణ, బేబినాయనకు శుభాకాంక్షలు చెబుతున్న టిడిపి నాయకులు



విజయనగరంలో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రావణి



వేపాడ ఎంపిపి డి.సత్యవంతుడుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న అధికారులు, నాయకులు

ఏడో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 7వ రోజుకి చేరుకుంది. సమ్మెలో భాగంగా సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీరాములు నాయుడుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం వల్ల సమ్మె లోకి దిగాల్సి వచ్చిందన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా కొత్త ఏడాదిలోనైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు భాస్కరరావు, రజనీ, రాజు కార్మికులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న నగర పంచాయతీ కార్మికులు సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.వి. రమణ, జిల్లా కార్యదర్శి యు.ఎస్.రవికుమార్, కమిటీ సభ్యులు కిల్లంపలి రామారావు మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు టి. బాబూరావు, బి.హరిబాబు, జె. శ్రీను, బి. రాము, టి. లక్ష్మీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల చేస్తున్న సమ్మె పట్ల మొండిగా వ్యవహరిస్తే పారిశుధ్య, కరెంటు, మంచినీరు రేపటి నుండి మొత్తం బంద్ చేసి పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. రాజాంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం ముందు సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, లక్ష్మి, గురువులు, రాంబాబు, వెంకటి, గోపి, కృష్ణ, రాజేష్, కనకరాజు, గిరిబాబు, చినబాబు, సింహాచలం, రఘు, రవి, బాలరాజు, సుగుణ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె శిబిరంలో సోమవారం నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు గౌరీష్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.



రాజాంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు



బొబ్బిలిలో సమ్మె శిబిరంలో కూర్చున్న మున్సిపల్ కార్మికులు

అశోక్‌ను కలిసిన అవనాపు విజయ్



టిడిపి నేత అశోక్‌గజపతిరాజును కలిసిన అవనాపు విజయ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయా అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. విజయనగరంలో వైసిపి జెండా పట్టుకున్న మొట్టమొదటి నాయకులు అవనాపు సూరిబాబు, ఆయన కుమారులు విజయ్, విక్రమ్‌లు. సూరిబాబు మరణం తర్వాత విజయనగరం నియోజకవర్గ ఇంఛార్జి బాధ్యతలు కూడా అవనాపు విజయ్ చూశారు. కోలగట్ల వీరభద్రస్వామి వైసిపిలో చేరిన తర్వాత అవనాపు కుటుంబానికి ప్రాధాన్యత తగ్గుతూ వచ్చింది. అయినా ఆ పార్టీ వెంటే ఉన్నారు.

టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం?

కోలగట్ల ఎప్పుడూ అవనాపు కుటుంబానికి ప్రాధాన్యత ఇవ్వకపోయినా వైసిపి అధికారంలోకి వచ్చేందుకు జగన్, షర్మిల పాదయాత్రల్లో లక్షల రూపాయలు ఖర్చు చేశారు. అవనాపు సూరిబాబు నివాసంలో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి బస చేసిన విషయం తెలిసిందే. అయినా అవనాపు విజయ్ కు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో కొంత కాలం బిసిలకు టికెట్ ఇవ్వాలని ఆందోళనలు చేపట్టి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు.

అధికారంలోకి వచ్చి ఐదేళ్ల అవుతున్నా పట్టించుకోక పోవడంతో టిడిపిలోకి వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలోనే తాజాగా నూతన సంవత్సర వేడుకలలో తెలుగుదేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజును సోమవారం కలిసి శుభాకాంక్షలు చెప్పడంతో ఒక్కసారిగా నగరంలో రాజకీయ చర్చ మొదలైంది. త్వరలో మంది మార్బలంతో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. విజయ్‌తో పాటు మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు మరి కొంతమంది నాయకులు అదే దారిలో ఉన్నట్లు తెలిసింది.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా : గద్దె

ప్రజాశక్తి-చీపురుపల్లి

రానున్న అసెంబ్లీ ఎన్నికలలో తమ కుటుంబం నుండి శాసన సభకు పోటీ చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు తెలిపారు. స్థానిక నటరాజ్ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రమంతా అవినీతి మయంగా ఉందన్నారు. ఇసుక, భూములు, మైనింగ్, మద్యంలలో పెచ్చుమీరి అవినీతి జరుగుతోందన్నారు. గంజాయి, గుట్కా కూడా అదుపు అడ్డూ లేకుండా రవాణా జరుగుతోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కేవలం కలక్షన్ చేసి సెలక్షన్ చేసి ఎలక్షన్‌కి వెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఎద్దేవా చేశారు. తన కుటుంబం నుండి ఒకరు వచ్చే ఎన్నికలలో పోటీకి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అది ఏ పార్టీ నుండి అనేది మాత్రం త్వరలో చెబుతానని గద్దె అన్నారు.

పల్లి ఆశయాలను నెరవేరుస్తాం

ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు



మాట్లాడుతున్న ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు

ప్రజాశక్తి-మెంటాడ

రైతులకు సాగునీరు, విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ఎనలేని కృషి చేసిన పల్లి తిరుపతిరావు మాస్టారు ఆశయాలను నెరవేరుస్తామని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం గుర్ల గ్రామంలో పల్లి తిరుపతిరావు 64వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్లగెడ్డ మినీ ప్రాజెక్టు నిర్మాణం కోసం అహర్నిశలు పాటుపడ్డారని కొనియాడారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెవివి జాతీయ ఉపాధ్యక్షులు గండ్రేటి లక్ష్మణరావు, నాయకులు ఎంవిఆర్ కృష్ణాజీ, రాష్ట్ర అధ్యక్షులు ఎంవిఎస్ వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.అప్పలనాయుడు, సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, సర్పంచ్ బొద్దల సత్యవతి, రెడ్డి రాజగోపాల్, పల్లి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.



వెన్నె సన్యాసినాయుడుకు కేకు తినిపిస్తున్న కిరణ్‌కుమార్

ఘనంగా 'వెన్నె' పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - గుర్ల

టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంపిపి వెన్నె సన్యాసినాయుడు పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తలతో కలసి కేక్ కట్ చేశారు. టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తిరుముల రాజు కిరణ్ కుమార్, సన్యాసినాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా తెట్టంగిలో విజయ బ్లడ్ బ్యాంకు మెగా రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా కార్యకర్తలు, అభిమానులు సన్యాసి నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వెన్నె సన్యాసినాయుడు మాట్లడుతూ రక్త దానం ప్రాణదానంతో సమానమన్నారు. తన జన్మదిన సందర్భంగా రక్తదానం చేసిన వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. వీరికి విజయ బ్లడ్ బాంక్ తరుపున బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లు ను అందచేశారు.

ఎస్‌టియు కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం ముద్రించి నూతన సంవత్సర క్యాలెండర్‌ను, డైరీని కలెక్టర్ నాగలక్ష్మి, డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగారావు, జిల్లా అధ్యక్షులు వై.అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్, రాష్ట్ర కౌన్సిలర్ వి.గోవిందరావు, జిల్లా అదనపు కార్యదర్శి సూరిబాబు. జిల్లా ఉపాధ్యక్షులు, ఎస్ఎస్‌దొర బి.అడివియ్య, శంకర్, మల్లేశ్వరరావు, కార్యదర్శులు మహేష్ ,పి రాంబాబు, జి.రవి బి .ఈశ్వరరావు, పడాల రమణ పాల్గొన్నారు.

మధురవాణి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

వాజీ ఛానల్ ఎమ్‌డి గణపతినీడి శ్రీనివాసరావు నివాసంలో సోమవారం తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వర్ధమాన రచయిత డోకి చంద్రశేఖర్ రాసిన మధురవాణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంచి పుస్తకాలు నేస్తాలవంటివని, ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని మెరుగుపరచేందుకు పుస్తకాలు దోహదపడతాయని ఈ సందర్భంగా శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో తెలుగుభాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, రచయిత చంద్రశేఖర్ దంపతులు పాల్గొన్నారు.

వైసిపి మండల కమిటీ నియామకం

ప్రజాశక్తి-బొండపల్లి

వైసిపి మండల నూతన కమిటీని ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. మండల అధ్యక్షులుగా బొద్దల చిన్నంనాయుడు, ఉపాధ్యక్షులుగా తాళ్లపూడి అప్పలనాయుడు, మంత్రి శ్రీరాములనాయుడు, ప్రధాన కార్యదర్శులుగా బాలి మన్మథరావు, సిరిపురపు జామినాయుడు, వేమలి వెంకటరావు, కోశాధికారిగా శిరిపురపు నాయుడుబాబును నియమించారు.